# పరివర్తన




—డి. సురేష్

కాఫీ ఒక్కొక్క గుటకే తాగుతున్న భర్తను బెదురుగా చూసింది మాధవి, మనసులోని కోర్కె అడగాలా వద్దా అని సంశయిస్తూ.

రెండు నిమిషాలు గడిచాయి. కావి, మాధవి మనసులోని భయం పోలేదు. కాలి బొటనవేలిని నేల రాస్తూ అలానే ఉండిపోయింది సందేహిస్తూ.

"ఊఁ, ఇదిగో!"

ఉలిక్కిపడి భర్త చేతిలోని ఖాళీకప్పు అందుకుంది.

'ఎందుకో ఈయన ముఖం రోజు కంటె ఇవాళ ఎక్కువగా చిటపటలాడుతూ

కనిపిస్తూంది. ఆఫీసులో పని ఎక్కువై నందునో లేక.

మరోసారి భర్త ముఖంలోకి చూసింది మాధవి. రాజారావు పేపరులోకి చూస్తున్నాడు దీక్షగా. బాగా అలిసి పోయినట్లు చిరుచెమటలు పట్టిన అతని ముఖమే చెబుతూంది. కళ్లలో చిరాకు, విసుగు స్ఫుటంగా కనిపిస్తున్నాయి. మాధవికి మరి పెదవి విప్పాలనిపించ లేదు. కాని, మనస్సులో దహించేస్తున్న కోర్కె ఆమెను ఉండనివ్వటం లేదు.

"ఏమండీ." ధైర్యం చేసింది మాధవి.

పేపరులోనుండి ముఖాన్ని పైకెత్తాడు రాజారావు.

"మరి . . . మరినాళ శాంతారాం పిక్చరుకు వెళదామనుకున్నాంగా." బెదురుగా, వణుకుగా అడిగింది మాధవి.

రాజారావు కనుబొమలు ముడి వడ్డాయి. కళ్లు తీక్షణంగా చూశాయి. "ఏం? అనుకున్న రోజే చూసేయాలా? సినిమా చూడకపోతే కొంప అంటుకుపోతాయా? లేక ప్రాణాలు పోతాయా? అసలు భర్త ఎలా ఉన్నాడు, ఎలా బాధ పడుతున్నాడు అనే ఆలోచన ఉందా నీకు? అవును, నే నెలా పోతే నీ కేం! నీకు మాత్రం సినిమాలు, షికార్లు కావాలి, ఛీ, ఛీ!" పేపరు విసురుగా కింద పడేశాడు.

మాధవి బాధగా తల దించుకుని చటుక్కున వెనుదిరిగి గబగబా లోపలికి వెళ్లిపోయింది.

"ఆఫీసులో చచ్చిచెడీ పనిచేసి ఇంటికి వస్తే కొంపలో క్షణం విశ్రాంతి దొరకదు. ఛీ ఛీ...కొంపకి రావటమే అసహ్యంగా ఉంది." ఈసడింపుగా విసుక్కున్నాడు రాజారావు. కుర్చీ వెనక్కి తల వాల్చి అలసటగా కనులు మూసుకుంటూ, నుదుటికి పట్టిన చెమట వేలితో విదిల్చాడు. చిన్నగా నిట్టూర్చి చటుక్కున లేచి లోపలికి వెళ్లాడు. బట్టలు మార్చుకొని బయటకు పోవటానికి ఉద్యుక్తుడైనాడు. ఇంతలో అతన్ని ఆకర్షించింది టేబిల్‌పైనున్న ఓ కవరు!

అది తనది కాదు. మాధవికి వచ్చిన లెటర్. ఆశ్చర్యపోయాడు రాజారావు. తమకు పెళ్లిఅయిన ఏడాదిలోనూ మాధవికి కవరు రావటం ఎరగడు. ఎప్పుడో గాని ఉత్తరం వచ్చినా కార్డు వచ్చేదే గాని, కవరు మాత్రం ఎప్పుడూ ఎవరూ వ్రాయలేదు. అటువంటి దీనాడు. . .

కవరులోని ఉత్తరాన్ని పైకి తీశాడు రాజారావు. అది ఎన్నో కాపుల ఉత్తరం! 'ఎప్పుడూ కవరే రాని మాధవికి ఇంత పెద్ద ఉత్తరం ఎవరు వ్రాశారు?' నిజంగా చాలా కుతూహలం వేసింది రాజారావుకు. అవును, అంతపెద్ద ఉత్తరం అతనికే ఎవరూ, ఎప్పుడూ వ్రాయలేదు మరి! ఆ వ్రాసినవా రెవరో, అందులో ఏముందో తెలుసుకోవాలనే ఆత్రత ఎక్కువైంది అతనికి. ఓ పుస్తకం లాగున్న ఆ కాగితాలను పట్టుకొని సావకాశంగా కుర్చీలో

ఒకరికోసం ఒకరం అన్నట్టు సుఖ దుఃఖాలు పంచుకోవడంలో, పరస్పరం ఒకరి నొకరు అర్థం చేసుకొనడంలోనే దాంపత్య జీవితం మూడు పువ్వులూ ఆరు కాయలుగా వికసిస్తుంది. కానినాడది కాడుగా మారిపోతుంది.

కూర్చుని ఆత్రంగా చదవటం మొదలు పెట్టాడు.

"మాధవీ,


ఎప్పుడూ లేనిది విజయ ఈ రోజు ఇన్ని పేజీల ఉత్తరం ఎలా వ్రాసిందా అని ఆశ్చర్యపోతున్నావు కదూ? నిజమే, మధూ, ఇంత పెద్ద ఉత్తరం నేను వ్రాస్తాననిగానీ, వ్రాయగలననిగానీ ఎప్పుడూ అనుకోలేదు. ఇంత వ్రాసినా ఇంకా చెప్పవలసిందేదో మిగిలిపోయినట్లు, వ్రాయవలసినదేదో ఇంకా ఉండిపోయినట్లు నా లోని అనుభవాల్నీ, అనుభూతులనీ, ఉత్సాహాన్నీ, ఉద్వేగాన్నీ సరిగా చెప్పలేకపోయాననీ అనిపిస్తూంది. వైవాహిక జీవితంలో ఇంత ఆనంద ముందని నేను కలలోకూడా ఊహించ లేదు. అబ్బ, ఈ భావ సంచలనాన్ని ఎలా వర్ణించను, మధూ!

నాకు శుభాకాంక్షలు పంపుతూ, నా వివాహపు అనుభవాల్ని వ్రాయమని కోరావు. పెళ్లై ఎన్నో నెలలుకూడా కాలేదు. అప్పుడే నాలో ఎన్ని అనుభవాలు! ఎన్ని అనుభూతులు!

బెంగుళూరు వచ్చేసి అప్పుడే నెల రోజులు కావస్తున్నా, నీకు ఉత్తరం వ్రాయటానికి ఇప్పటికిగాని తీరిక చిక్కలేదు నాకు. అందుకు కారణం శ్రీవారే అని వేరే చెప్ప నవసరం లేదనుకుంటాను. అంటే వ్రాయనివ్వరని కాదు. నిజంగా, మధూ. వారి ఆలోచనలతోనే రోజంతా గడిచిపోతుంది నాకు. ఆయన ఇక్కడ ఓ బాంకులో అకౌంటెంట్ అని నీకూ తెలుసుగా. పది గంటల వరకూ ఆయన పనులతోనే అయిపోతుంది. ఇక ఆయన పది గంటలకి వెళ్లిన తరువాత మధ్యాహ్నమంతా ఖాళీయే. కాని, ఏ పనీ చేయాలనిపించదు. నిరంతరం వారినిగురించి ఆలోచిస్తూ,వారిని పొందిన నా అదృష్టానికి మురిసిపోతూ, వారి చిలిపి మాటలు, చిలిపి చేష్టలు తలుచుకుంటూ అలా ఉండటమే హాయిగా ఉంటుంది నాకు. అందుకే నీకు ఉత్తరం వ్రాయటమూ ఆలస్యమే అయింది."

'అబ్బ, ఏమిటీ సోదీ, ఉత్తరమంతా ఇదేనా? అయినా ఇది వ్రాయటానికి ఇంత గొడవేమిటి?' విసుక్కుని మళ్లీ ఉత్తరంవేపు దృష్టి మళ్లించాడు రాజారావు.

"నా అనుభవాలని వ్రాయమని వేరే అడగాలా,మాధవీ? ఇంత భావసంచలనాన్ని, ఇంత ఉద్వేగాన్ని నా లోనే ఇముడ్చుకుంటే నా గుండె బ్రద్దలవదూ? నీకూ వివాహమైంది. అందుకే నా అనుభవాల్ని నిస్సంకోచంగా చెప్పదలుచుకున్నాను.



చిత్రం—ఎ. డి గౌరీశంకర్ (అనంతపురం)

నాలా నీవూ ఇలాంటి అనుభూతుల్ని ఎన్నిటిని భద్రంగా గుండెల్లో ఇముడ్చుకున్నావో!

మా శ్రీవారిది గుంటూరని, ఉద్యోగ రీత్యా ఆయన ఒక్కరూ బెంగుళూరులో ఉంటున్నారని నీకు తెలుసు. మా పెళ్లి గుంటూరులోనే అయిందనీకూడా నీకు తెలుసు. ఇక మా వివాహం అయిన వెంటనే బెంగుళూరు వచ్చేశాం. నాకు మొదటినుండీ బృందావన్ గార్డెన్స్ చూడాలని కోర్కెగా ఉండేది. ఇప్పుడు మైసూరుకు దగ్గరగా రావటంతో ఆ కోర్కె మరింతగా బలం పుంజుకుంది. ఆయన నా కోర్కె గ్రహించి మొన్ననే మైసూరు తీసుకువెళ్లారు.

అబ్బ, మైసూరులోని ఆ బృందావనాన్ని చూసితీరాలి, మధూ! ప్రపంచంలోని సౌందర్యమంతా అక్కడే గూడు కట్టుకొని ఉందేమో! నిజంగా అక్కడున్నంత సేపూ ఓ స్వప్నంలా గడిచిపోయింది. రంగురంగు నీళ్లను ఫౌంటెన్స్ వెదజల్లుతూంటే ఎంత ఆకర్షణీయంగా ఉంటుందో తెలుసా? ఆ నీరు ఒక్కో దగ్గర పచ్చగా, మరో దగ్గర నీలిగా, ఇంకోచోట ఎర్రగా— ఓహ్, ఎన్ని రకాలని! చెట్ల ఆకుల సందులోంచి లైట్లకాంతి సూర్యకిరణాల్లా వెలువడుతూంటే వాటిని చూస్తూ అలానే ఉండిపోవా లనిపిస్తుంది.

గార్డెన్ మధ్యగా చిన్న సరస్సు. ఆ సరస్సులో కావాలనుకున్నవాళ్లు బోటు షికారు వెళ్లవచ్చు. శ్రీవారు టిక్కెట్టు తీసి బలవంతంగా బోటులో కూర్చోబెట్టారు నన్ను. చుట్టూ నీరు. ఆ నీటిని చీల్చుకుంటూ మా బోటు దూసుకుపోతూంది. సరస్సు మధ్యకు వచ్చేసరికి నాకు భయం వేసింది. శరీరం జలదరించింది. భయంగా ఆయన గుండెల్లో ముఖం దాచుకున్నాను. ఆయన నన్ను తన చేతులతో చుట్టేసి మరింత గట్టిగా హృదయానికి హత్తుకుంటూంటే జీవితంలో మరేమీ అక్కర్లే దనిపించింది. ఆ గార్డెన్‌లో ఆయన నన్ను ఎన్ని రకాల పోజుల్లో ఫోటోలు తీశారో చెప్పలేను.


మాధవీ, శ్రీవారు దేవుడు వంటివారని ఈ కొద్దికాలపు వ్యవధిలోనే ఆకళింపు చేసుకున్నాను. ఆయ నెంత చిలిపివారు మరెవరూ ఉండరని ఓ క్షణం అనిపిస్తే మరుక్షణంలోనే ఆయనలోని గాంభీర్యాన్ని మరెక్కడా చూడలేం అనిపిస్తుంది. ఒక క్షణంలో ఏడిపించి మరుక్షణంలో నవ్వించగలనేర్పరి. అవధులు దాటిన ఆయన ప్రేమలో, అనురాగంలో

ఆప్యాయతలో, ఆదరణలో నే నేమై పోతున్నానో నాకే అర్థంకావటంలేదు. ఆయనలోని సంస్కారం, విశాలహృదయం, ఆదర్శాలు, ఆశయాలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నా కిలాంటి భర్త దొరుకుతాడని ఎన్నడూ అనుకోలేదు, మధూ ఇది ఏ జన్మ సుకృతమో మరి! పెళ్ళికి ముందు ప్రతి కన్నెపడుచు తన భర్తను ఎంతో ఉన్నతంగా, ఉదాత్తంగా చిత్రించుకుంటుంది. అలానే నేనూ ఊహించుకున్నాను. ఆ కలలన్నీ నిజాలు కావటం ఎంత అదృష్టం!

పనులు నా కోసం నీవు చేస్తూండగా నీ కోసం నేను ఒక్క సిగరెట్లు తాగడం మానేయలేనా?' అన్నారు. నిజంగా ఆ రోజు నేను పొందిన ఆనందం వర్ణనాతీతం. ఆ రోజునుండి ఆయన కోసం ప్రాణాలైనా ఇవ్వాలి అన్నంత ఉద్వేగం నా నరనరాల్లో ఆవరించింది. 'నీ వీ పని చెయ్యి, లేకపోతే నీ ప్రాణాలు తీస్తాను' అని రాక్షసుడిలా అరుస్తూ భార్యచేత పనులు చేయించుకుంటే అదేం గొప్ప? భార్య తనకు తానే భర్త కోసం, భర్తపై ప్రేమతో చేయాలి. అదీ గొప్పతనం. నేను నాకు ఇష్టంలేని పనులు ఇన్ని చేస్తున్నానంటే అది ఆయనపై ప్రేమ వల్లనే.

అనుకునే ఆయన కోసం, నా కళ్ళలోకి, నా ముఖంలోకి, నా అణువణువులోకి చూస్తూ యుగాలు గడపాలని కోరే ఆయన కోసం! నా జీవితమంతా ఇలా ఆయన శరీరంలో, కళ్ళల్లో, ఊపిరిలో, అణువణువులో కలిసిపోయి ఈ ప్రపంచమే మరిచిపోవాలి. భగవంతుడు నాకు ప్రసాదించిన వరాన్ని భద్రంగా నా గుండెల్లో దాచుకోవాలి. నిజంగా భార్య కొసం భర్త, భర్తకోసం భార్య అనే భావన ఎంత మధురంగా ఉంటుంది! ఆ ఒక్క భావనకలిగించేఆనందం ప్రపంచంలో మరే శక్తీకూడా కలిగించలేదేమో? కదూ, మాధవీ!

పోయినా చిరునవ్వుతో పలకరించాలి. నవ్వుతూ మాట్లాడాలి. భర్త ఆఫీసరు చేత చీవాట్లు తిని ఆ కోపంతో, చిరాకుతో భార్యను తిట్టినా, కొట్టినా సహించాలి, భరించాలి, నోరు మూసుకోవాలి. భార్యకు అభిమానం ఉండదా? అలిసి ఇంటికి వచ్చిన భర్తకు చిరునవ్వులు, ఓదార్పు మాటలు ఎంత అవసరమో ఇంటెడు చాకిరీ చేసిన భార్యకూడా భర్తనుండి అదే ఆశిస్తుందని ఎందుకు తెలుసుకోలేరీ భర్తలు? అలిసిపోయిన భర్తకు సాయంత్రం షికార్లు, సినిమాలు ఎంత అవసరమో భార్యకూ అంతే అవసరం అని ఎందుకు గ్రహించలేరీ ప్రబుద్ధులు? ఈ ఆలోచనలే కదలాడేవి పెళ్ళికి ముందు నాలో ఎప్పుడూ. అందుకే పెళ్ళిచేసుకోనని వాదిస్తూండేదాన్ని మీ అందరితో. కాని, నన్ను ఆకర్షించి, పెళ్ళి చేసుకొని, మగవారిలోనూ మంచివా రున్నారని, అందరూ ఒక్కలానే ఉండరని నిరూపించా రాయన.




సిగరెట్లు తాగేవారంటే నాకు చాలా అసహ్యమన్న సంగతి నీకుకూడ తెలుసుగా. ఆయన విపరీతంగా సిగరెట్లు కాల్చేవారు. మాటల సందర్భంలో నే నెప్పుడో ఆయనతో సిగరెట్లు తాగే వారంటే నాకు చాలా అసహ్యమని చెప్పాను అంతే, ఆ తరవాత మరెప్పుడూ ఆయన చేతిలో సిగరెట్ చూడలేదు నేను. ఒకసారి అడిగితే ఏమన్నారో తెలుసా? 'విజీ, నాకు గులాబీరంగు అంటే ఇష్టమని తెలిసి నీవు నీ కిష్టమైన పసుపురంగు చీర వదిలేసి గులాబీ రంగు చీర కట్టి ఆ రోజు సినిమాకి వచ్చావు. నీవు రెండు జడలు వేసుకోవటం నా కిష్టం లేదని తెలిసి వాలుజడ వేసుకోవటం ప్రారంభించావు వంకాయలంటేనే అసహ్యించుకునేదానివి నాకు వంకాయలు ఇష్టమని గ్రహించి వంకాయ[illegible] తినటం అలవాటు చేసుకున్నావు. నీ కిష్టం లేని

నిజంగా స్త్రీ అల్పసంతోషి, మధూ! ఎంత కష్టపడినా, భర్త ప్రేమతో ఒక్క మాట అంటే చాలు, పులకించిపోతుంది. తన జీవితం ధన్యమైనట్లే భావిస్తుంది. ఎన్ని సంపదలున్నా, ఎన్ని భోగభాగ్యాలున్నా భర్త అనురాగానికి నోచుకోని బ్రతుకు బ్రతక్కపోతేనేం?

కాని, భగవంతుడు నాకు సంపదతో పాటు చక్కని భర్తనుకూడా ప్రసాదించాడు. చాలు, మాధవీ, ఇక ఏ క్షణంలో ఈ జీవితం ముగిసిపోయినా నేను బాధపడను. ఊహుఁ కాదు — నేను జీవించాలి ఇంకా చాలా కాలం నా కోసం కాదు, ఆయన కోసం నాకు తలనొప్పి వస్తేనే విలవిల్లాడే ఆయన కోసం. నేనే తన జీవితం, ప్రాణం, ఆయువు

అసలు భార్యకూడా మనిషేనని, ఆమెకూ ఓ మనస్సు, వ్యక్తిత్వం, ఆశలు, ఆశయాలు ఉంటాయని ఆలోచించేవారెందరు? భార్య సినిమాకి తీసుకు వెళ్ళమంటే చిరుబుర్రులాడే భర్తల సంగతి నీకూ తెలుసుగా. ఆఫీసులో పని సరిగా చేయలేక ఆఫీసరుచేత చీవాట్లు తిన్నా, నెలజీతం సరిగా ఖర్చుకు సరిపోక పోయినా, అన్నంలో రాయివచ్చినా, కూరలో కారం ఎక్కువైనా, చాకలివాడు బట్టలు టైముకి తీసుకురాకపోయినా, షర్టు గుండీ తెగిపోయినా, పిల్లవాడు ఏడుస్తున్నా, ఇల్లు శుభ్రంగా లేకపోయినా — అన్నిటికీ భార్యే కారణమని భార్యను నాచి రంపాన పెట్టే భర్తలు ఎందరో! ఆఫీసులో పనిచేసి అలిసిపోయి ఇంటికి వస్తే, భార్య ఇంటిలో ఎంత బండచాకిరీ చేసి అలిసి

అయినా జీవితం సాఫీగా గడవాలంటే, నందనవనంగా మారాలంటే ఒక్క భర్త మంచివాడైతేనే సరిపోదు, మాధవీ! అందుకు భార్య తోడ్పాటుకూడా ఎంతో అవసరం. ఇరువురిలో ఏ ఒక్కరిలో లోపమున్నా ఆజీవితం నరకమేఅవుతుంది. దుఃఖభాజనమే అవుతుంది. అనుభవ పూర్వకంగా చెబుతున్నా నీ మాట


మా ఇంటి కెదురుగా ఓ ఫామిలీ ఉంది. అతని పేరు గోవిందరావు. అతని భార్య సీత. గోవిందరావు నిజంగా చాలా

నెమ్మదస్థుడు. ఉన్నత భావాలుగల వ్యక్తి. తన భార్య ఆనందానికి అతను చేయని పనంటూ లేదు. భార్య ఆనందం కోసం అనుక్షణం ఆరాటపడతాడు. ఆమె సంతోషం కోసం ఏమైనా చేస్తాడు. కాని, అతని భార్య అతని నర్థం చేసుకోదు. అతని ప్రేమను గ్రహించటానికి ప్రయత్నం చేయదు. గోవిందరావు ఒక్క రోజు ఆమె తీసుకు రమ్మన్నప్పుడు పూలు తీసుకురావటం మరిచిపోతే, కోరినప్పుడు సినిమాకి తీసుకువెళ్లలేక పోతే, డబ్బులేక చీర కొనిపెట్టలేకపోతే, అడిగినప్పుడు ఆమెను పుట్టింటికి పంపించకపోతే, ఆమె బంధువులకు కానుక లిచ్చి మెప్పించకపోతే, ఏ ఒక్క రోజైనా ఆఫీసులో పని ఎక్కువగా ఉండి ఇంటికి టైముకు రాకపోతే, ఏ నెలలోనైనా ఆమె తన ఖర్చు కోసం ఇచ్చిన డబ్బు అయిపోయి మరో నయాపైసా ఖర్చు కోసం అడిగితే. . . గోవిందరావు పని ఆ రోజు ఆఖరు. ఆ కాళిక అతన్ని చీల్చి చెండాడుతుంది. పోలేరమ్మలా మండి పడుతుంది. మహంకాళిలా విజృంభిస్తుంది. ఆ నోటికి అడ్డూ ఆపూ ఉండదు. ఆ రాగాలాపనకు అంతూ పొంతూ కనిపించదు.

భర్త తనను నానా కష్టాలు పెట్టేస్తున్నాడనీ, తన కా ఇంట్లో వీస మెత్తు విలవ లేదనీ, సుఖం లేదనీ, పూలు పెట్టుకోవటానికి గతిలేదనీ, సినిమాకి సరదాగా వెళ్లలేననీ, చీర కొనటానికి గతిలేదనీ, పుట్టింటికి వెళ్లేటంత భాగ్యం లేదనీ, బంధువులను ఆదరించే పాటి అదృష్టం నోచుకోలేదనీ— ఇలా ఎన్నోఏకరువు పెడుతూ రాగాలుతీస్తుంది. ఆ రోజు సమ్మె చేస్తుంది. వంట ఉండదు, భోజనం ఉండదు, కంటి నిండా నిద్రకూడా ఉండదు గోవిందరావుకి. పాపం, ఆ భర్త నోరెత్తడు ఇంత జరిగినా. భార్యను ఏమన్నా అనాలంటే సభ్యత అడ్డు వస్తుంది. సంస్కారం నిలుపుతుంది. పాపం, సంస్కారం, సభ్యత అనే ముసుగులో పడి క్రుగ్గిపోతున్న గోవిందరావు!

ఇప్పుడు చెప్పు, ఆ సంసారం అలా ఎందుకైందంటావు? గోవిందరావు అసమర్థత వలన కాదూ? అతని భార్య అసహ్యపు ప్రవర్తనవల్ల కాదూ? గోవిందరావు భార్యలాంటి వారికి నెమ్మది మీద చెపితే అర్థం కాదు. భర్త మంచితనాన్ని అసమర్థతగా తీసుకున్న మూఢురాలు. అలాంటివారికి భర్తనుండి కొన్ని చీవాట్లు, దెబ్బలు పడితేగాని జీవితపు విలవను గ్రహించటం చేత కాదు. కాదంటావా?

భార్య కూర్చుంటే తప్పు, నిల్చుంటే తప్పు, ఒకపని చేస్తే ఆగ్రహం, మరో పని చేస్తే అనుగ్రహం—అలాగ ఆమెను తన్నుతూ, తిడుతూ, ఏడిపిస్తూ, మర బొమ్మలా ఆడిస్తూ, చిత్రవధ చేస్తూ— ఇలాంటి భర్తలేకాదు, భర్త మంచితనాన్ని ఆసరాగా తీసుకుని అతన్ని అనుక్షణం అనేక విధాల హింసించి, పీడించి, సాధించి అతనికి సుఖాన్ని కరువు చేసి, తాను నగలు, చీరలుకొంటూ, సినిమాలు, షికార్లు చేస్తూ తన బంధువులను ఆదరించుకుంటూ, పుట్టింటివారిని ఆకాశాని కెత్తేస్తూ, భర్త తరపువారిని ఈసడించుకుంటూ,



ఆలోచన ఫోటో: ఎస్. ప్రభాకరరెడ్డి (కడప)

జీవితమంటే అదే అనీ, అందులోనే సౌఖ్యం ఉందనీ బ్రతుకును నరకంగా తయారుచేసే భార్యలుకూడా ఈ భారతదేశంలో, పతివ్రత లుద్భవించిన ఈ భారతభూమిలో లేకపోలేదు.

అందుకే, మధూ, జీవితం స్వర్గంలా నడవాలంటే భార్య, భర్త—ఇద్దరిలోనూ సామరస్యం ఉండాలన్నరి. జీవిత నావకు తెడ్లు వేసేవారు ఆడా మగా, భార్యా భర్త, మొగుడూ పెళ్లాం. ఒక జీవిత నావ హాయిగా పయనించిందంటే, మరో జీవిత నావ సుడిగుండాల్లో చిక్కుకుందంటే అందుకు కారణం భార్యేకాదు భర్త కూడా. ఆడా, మగా ఇద్దరూ కారణం. జీవితరథానికి భార్యా, భర్త రెండు చక్రాలు. ఏ ఒక్క చక్రంలో లోపమున్నా ఆ రథం ఇక కదలలేదు.

భర్త ప్రేమంతా భార్యకు చెందాలి. భార్య తన ప్రేమనంతా భర్తకు అందివ్వాలి. భర్త తన మనసునంతా భార్యకు అర్పించాలి. భార్య తన మనసునంతా భర్తకు అంకితం చేయాలి. భర్త తన అణువణువూ భార్యకు చెందేట్లు చేయాలి. భార్య తన అణువణువునూ భర్తలో ఐక్యం చేయాలి.

వారి మధ్య ఏ రహస్యాలు, పొరపొచ్చాలు లేకుంటే ఆ జీవితం ఎంత హాయిగా, ఎంత మధురంగా ఉంటుందీ! అప్పు డిక జీవితమంటే స్వర్గమే కదూ!

నన్ను శ్రీవారూ, ఆయన్ని నేనూ ఇంత చక్కగా అర్థం చేసుకోగలటం ఎంత అదృష్టం! మా జీవితం ఇంత ఆనందంగా గడుస్తున్నదంటే అది ఒకరి భావాలకు తగినట్లుగా మరొకరు నడుచు కోవటం, ఒకరి ఇష్టానికి అనుగుణంగా మరొకరు తన ఇష్టాలను మార్చుకోవటం వల్లనే.

ఓహ్, నాకు తెలియకుండానే ఎన్ని విషయాలు వ్రాసేశానో, ఇవన్నీ చదివి నువ్వు నవ్వుకోవు కదా! అరే...వ్రాస్తూ వ్రాస్తూంటే ఎంత టైం గడిచి పోయిందో చూశావా? అదిగో, అప్పుడే అయిదున్నర కావస్తూంది. శ్రీవారు వచ్చే వేళ అయింది. వచ్చేసరికి కాఫీ, టిఫిన్ రెడీగా ఉంచాలి. షికారు పోవటానికి సిద్ధం కావాలి. ఆయనకు ఇష్టమైన గులాబీరంగు చీర కట్టుకొని పక్క పాపిటతో వాలుజడ వేసుకొని (ఆయనకు పక్కపాపిటతో వాలుజడ వేసుకొంటే ఇష్టం. ఆయన కోసం తప్పదుగా మరి) దోసకాయగింజలా బొట్టు పెట్టుకొని (శ్రీవారికి ఈ బొట్టంటే చాలా ఇష్టం) తయారుగా ఉండాలి. లేకపోతే రాజావారు అలిగి కూర్చుంటారు. టిఫిన్ తిననని, కాఫీ తాగనని మూతి బిగిస్తారు. అబ్బో, అప్పు డాయన్ని ప్రసన్నం చేయటానికి దేవతలు దిగిరావాలి. లేకపోతే ఆయన పద్ధతి ప్రకారం ఆయన నోటికి నా చెంపలు, పెదవులు అప్పగించి కూచోవాలి. అమ్మో, ఆ బాధ భరించటం మరీ కష్టం. ఎందుకంటే నా పెదాలు తియ్యగా ఉన్నాయనీ, బుగ్గలు ఆపిల్స్‌లా ఉన్నా యనీ కొరుక్కు తినేస్తారు. అయినా నా దేవుని కోరికకు భిన్నంగా నే నేమైనా చేయగలనా! ఆయనకు బాధ కలిగితే. . . ఉహుఁ. ఆ ఊహే భరించలేను. నిజంగా, మాధవీ, ప్రేమంటే ఏమిటో, ప్రేమించటం ఎలాగో ఆయన దగ్గరే తెలిసింది నాకు. నిండైన ప్రేమమూర్తి ఆయన. అదిగో, మరో అయిదు నిమిషాలు గడిచాయి.

ఇక ఉంటాను, మధూ.

ఇప్పటికే విజయ చాలా మారి పోయిందని అనుకుంటున్నావు కదూ? నిజమే, ఇంకా మారిపోతానేమోకూడా. అయినా ఇవన్నీ నీకు మాత్రం అనుభవం కాదా? వెంటనే జవాబు వ్రాస్తావు కదూ?

—నీ విజీ.''

ఉత్తరం పూర్తిచేసి అలా అచేతనంగా ఉండిపోయాడు రాజారావు. అతని మెదడు పనిచేయటం మానేసింది. శరీర మంతా తిమ్మిరి పట్టినట్లు ఎలాగో అయిపోయింది. గుండెల్లో ఏదో అనిర్వచనీయమైన ఉద్వేగం, భావాలకు, మాటలకు అందని ఏదో సంచలనం! ఏదో బాధ గుండెలో పుట్టి, నరనరమూ ఆవరించి, ప్రతి రక్తకణంలో జీర్ణించుకుపోయి శరీరాన్ని నిలువునా కదిలించ సాగింది.

చాలాసేపటికి తేరుకుని చెమటలు పట్టిన ముఖాన్ని తుడుచుకుని కాయితాలు కవరులో పెట్టి, యథాతథంగా కవరు టేబిల్‌పై ఉంచేసి మరక్కడ ఉండలేక చటాలున వీథిలోకి నడిచాడు గబగబా.

ఎంతోసేపు అలా బజారు వీథులన్నీ అగమ్యగోచరంగా తిరిగి చివరికి ఓ పార్కు లోకి వచ్చి పడ్డాడు. పార్కులో [illegible] అలిసిపోయిన శరీరానికి [illegible] హాయనిపించింది. శరీర[illegible]కి వచ్చింది. మెదడు [illegible] మెదలు

పెట్టింది. మనసు ఆలోచించడం మొదలు పెట్టింది.

'భర్తగా మాధవికి నువ్వేం న్యాయం చేశావు?' మనసు వేసిన మొట్టమొదటి ప్రశ్న! తెల్లబోయాడు రాజారావు.


'నిజం, తనేం చేశాడు మాధవి కోసం? కనీసం మనసిచ్చి మాట్లాడతాడా? ఎప్పుడూ కస్సుబుస్సులాడుతూ . . . మొన్నంటే మొన్నపూలుతీసుకురమ్మంటే, అందులోనూ తన పుట్టిన రోజున... 'పూలు సింగారించి సినిమాలకీ, షికార్లకీ బయలు దేరాలి కాబోలు. పెరటిలో అన్ని గులాబీలు ఉండగా బజారులో డబ్బు పోసి ఆ మల్లెమొగ్గలు కొంటేనే గాని తృప్తి లేదా?' అని తిట్టలేదూ. పాపం, మాధవి మారుపలక లేదు. అవును. భర్త ఆదరణలో, భర్త సంపాదనలో బతికే ఆడది మొగుడికి ధైర్యంగా ఎలా సమాధానం చెప్పగలదు? అందులోనూ మాధవిలాంటి ఆడది! రోజూ సిగరెట్లకి ఇంత డబ్బు తగలేస్తాడే, మరి ఒక్క రోజు పూలు కొంటాననే మాధవి కోరిక ఘోరమా? ! పొద్దుట లేచినది మొదలు ప్రతిదానికీ విసుక్కున్నా, కసురుకున్నా, తిట్టినా ఎప్పటిలా పలకరిస్తుంది మాధవి. చిరునవ్వుతో ఆదరిస్తుంది. ఎందువలన? ఎవరికోసం? తన కోసం, భర్త సుఖపడాలనే తపన వలన.

కాని, భార్య ఆనందించాలని—మాధవి కోసం ఒక్కటి, ఒక్కటంటే ఒక్క పని చేశాడా! తనకు ఏమాత్రంజవాబిచ్చినా మండిపడతాడే! ఉన్నదానికీ, లేనిదానికీ అర్థం లేకుండా ఆమెను తూలనాడతాడే! మరి తనింత కసిరినా తనను పట్టి దేవుళ్లాడటానికి ఆమెకు అభిమానం లేదూ? రోజూ ఎక్కడెక్కడో తిరిగి, క్లబ్బులో ఆడుకొని అర్ధరాత్రి ఇంటికి వచ్చినాకూడా మాధవి ఎంత ఓర్పుగా తన కోసం ఎదురుచూస్తూ కూర్చుంటుందనీ. 'ఆ నిద్రమొహంతో ఎందుకలా ఎదురు చూడ్డం? నీ వలా నా కోసం కాచుకుని ఉండకపోతే నిన్ను తిడతాననీ, కొడతాననీ నిన్నేమినా ఆంక్షలు విధించలేదే?' అని కసిరేవాడే గాని, ఆమె మనసును అర్థం చేసుకోవటానికి ఒక్కనాడైనా ప్రయత్నించాడా తను?

మాధవిని ఎన్ని విధాల సంకెళ్లలో బంధించాడు తను! ఆమెకు వీధుల్లో కెళ్లటానికి నిషేధం, పుట్టింటికి వెళ్లటానికి నిషేధం, పూలు కొంటానికి నిషేధం, ఉత్తరాలు వ్రాయటానికి నిషేధం, డబ్బు ఖర్చుపెట్టటానికి నిషేధం — ఇలా ప్రతి దానికీ పరిమితులు. ప్రతి పనికీ పరిమితులు. అడుగడుక్కీ ఆంక్షలు! ఈ కట్టుబాట్లకు మాధవి హృదయం ఎంత బాధకు గురి అయిందో!'

రాజారావు హృదయం పశ్చాత్తాపంతో దహించుకుపోయింది. బాధతో మనసు మెలికలు తిరిగిపోయింది విజయ ఉత్తరంలోని ఒక్కొక్క మాటే గుర్తు రాసాగాయి. 'అబ్బ! భార్యాభర్తల అనుభవాన్ని ఎంత చక్కగా వ్రాసిం దామె! నిజంగా అలాంటి జీవితమే జీవితం!

ఆలోచిస్తున్నకొలదీ మాధవిపై జాలి, ప్రేమ, అనురాగం ముంచుకు వచ్చాయి రాజారావుకు. గబగబా ఇంటికి



దాగుడుమూతలు
ఫోటో పి. ఎమ్. వరప్రసాదరావు (గుంటూరు—2)

వెళ్లి మాధవిని కావిలించుకుని, ముద్దుల వర్షం కురిపించి, "మధూ! ఇకనుండి మన జీవితం మారిపోతుంది, మధూ! ఇకనుండి నీవే నేను, నేనే నీవు. కష్టం, సుఖం పంచుకుందాం. ఆనందం, దుఃఖం సమంగా అనుభవిద్దాం. భార్యాభర్తల పదాలకు నిజమైన అర్థాలు కల్పిద్దాం" అని చెప్పాలనిపించింది. మరి అక్కడ నిలవలేక పోయాడు. ఆ పార్కు, ఆ గాలి, ఆ చల్లని వాతావరణం అతనికి వేడిగా, భరించలేనివిగా ఉన్నాయి. ఎంత వేగంగా మాధవి ముందు నిలుద్దామా అని అతని మనసు ఆరాటపడుతూంది.

ఇంటికి వెళుతూ తోవలో చక్కటి మల్లెదండ కొన్నాడు మాధవి కోసం. గబగబా అడుగులు వేసుకుంటూ నడిచాడు. అతనిలోని ప్రతి అణువూ 'నా మాధవి, నా భార్య, నా ప్రాణం' అని జపిస్తుంది.

ఇంట్లో అడుగు పెడుతూనే "మధూ" అని అరిచాడు. అతని పిలుపు విని మాధవి హడావిడిగా వచ్చింది.

మాధవిని అమాంతం తన చేతులతో చుట్టేసి దగ్గిరికితీసుకున్నాడు రాజారావు. వంగి ఆమె నుదుటిపై ముద్దు పెట్టుకున్నాడు ఆప్యాయంగా. మాధవి వింతగా చూసింది భర్తను.

మాధవి జడలో మల్లెదండ తురిమి, మత్తుగా వాటిని వాసన చూస్తూ రాజారావు: "మాధవీ, ఇన్నాళ్లు నిన్నర్థం చేసుకోలేక నిర్లక్ష్యం చేశాను. నీ స్నేహితురాలి ఉత్తరం నా కళ్లు తెరిపించింది. ఇక మన ఇద్దరి జీవితాలు మారిపోతాయి, మాధవీ. కష్టసుఖాల్లో ఇద్దరం ఒకటిగా నిలుద్దాం. ఇంతకంటె ఎక్కువ చెప్పలేను, మధూ. నీ కర్థమైందనుకుంటాను" అంటూ మాధవి కళ్లలోకి చూశాడు.

మాధవి అర్థమైందన్నట్లు చిన్నగా నవ్వి కనులు వాల్చుకుంది సిగ్గుగా. ఆనందంగా.

ఆ రోజు రాత్రి నిద్రపోవటానికి ముందు విజయకు ఉత్తరం వ్రాయటం మొదలు పెట్టింది మాధవి.

"విజీ,

ముందుగా నీకు ఎన్నో ధన్యవాదాలు చెప్పాలి. మనం అనుకున్నట్లుగానే మన ప్లాను పారింది. ఆయన నీ ఉత్తరం చూశారు. మనం ఆశించిన పరివర్తనే కలిగింది. పాపం, నీకు అసలు వివాహమే కాలేదని ఆయనకేం తెలుసు! అబ్బ, ఏ అనుభవమూ లేకుండా అంత చక్కగా జరిగినట్లుగా, అంత సహజంగా ఎలా వ్రాశావే!

నీ దయవల్ల ఆయన మారిపోయారు. ఇక నా జీవితం నందనవనమే అవుతుంది. ఆయనలోని ఈ పరివర్తనకు కారణమైన నిన్ను ఎలా అభినందించను? ఏ విధంగా నీకు నా కృతజ్ఞతను తెలుపుకోను? ఏ తీరున ఈ ఋణం తీర్చుకోగలను? అవును, ఒక్క పని చేసి నీ ఋణం తీర్చుకుంటాను. భగవంతుడిని ప్రార్థించటం! ఎందుకని అడగవేం? అదే. . . మా విజీకి తాను వర్ణించిన భర్తలాంటి భర్తనే ప్రసాదించమనీ, ఉత్తరంలో వ్రాసినట్లే విజీ త్వరలో అలాంటి జీవితం గడపాలనీను. అదిగో, అలా కోప్పడకమ్మాయ్! అయినా అంత చక్కగా వ్రాసిన నీ హృదయంలోని భావాలను తెలుసుకోలేననుకున్నావా? చూస్తుండు. నా ప్రార్థన ఆలకించి దేవుడు మన్మథుడులాంటివాడిని ఈ సుగుణాల రాశికి భర్తగా ప్రసాదిస్తాడు. అప్పుడు మళ్లీ ఇలాంటి ఉత్తరమే నిజంగా అనుభవిస్తున్న సంఘటనలతో వ్రాస్తావు. అరే, అప్పుడే అంత సిగ్గా? పిచ్చి విజీ!

మరి ఉండనా, విజీ. మరోసారి నా హృదయపూర్వక అభినందనలు అందజేస్తూ, కృతజ్ఞతతో...

— నీ మాధవి."

ఉత్తరం పూర్తిచేసి లైటు ఆర్పుతూ ప్రశాంతంగా నిద్రపోతున్న భర్త ముఖంలోకి ఒక్కసారి తృప్తిగా చూసి నిండుగా, హాయిగా నవ్వుకుంది మాధవి, ముందు ప్రారంభమయ్యే స్వర్గాన్ని మరిపించే జీవితాన్ని తలుచుకుంటూ. ★